నమస్తే తెలంగాణ
సిద్దిపేట
I | హైదరాబాద్, ఆదివారం 18 మే 2025 | SIDDIPET

## హరీశ్‌రావును కలిసిన ఎమ్మెల్యే


నర్సాపూర్: హరీశ్‌రావును కలిసిన ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి

నర్సాపూర్, మే 17: మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావును శనివారం గచ్చిబౌలిలోని ఆయన నివాసంలో నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాల క్ష్మారెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. నియోజకవర్గంలోని పలు సమస్యలను హరీశ్‌రావు దృష్టికి తీసుకెళ్లినట్లు సునీతాల క్ష్మారెడ్డి తెలిపారు. వీరితో పాటు బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు వంటేరు ప్రతాప్‌రెడ్డి, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ చంద్రాగౌడ్, మాజీ ఎంపీపీ హరికృష్ణ, ఆత్మకమిటీ మాజీ చైర్మన్ వెంకట్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రమణాగౌడ్, నాయకుడు రమాకాంత్ రెడ్డి తదితరులు ఉన్నారు.

**హరీశ్‌రావు ఆపన్నహస్తం**

గజ్వేల్, మే 17: గజ్వేల్ పట్టణానికి చెందిన బీఆర్ఎస్‌వీ నాయకుడు నవాజ్ ఉపాధి నిమిత్తం గత నెల ముంబయిలోని ఏజెంట్ ద్వారా సౌదీ అరేబియాకు వెళ్లాడు. అక్కడి ఏజెంట్ నవాజ్‌ను మోసం చేయడంతో అక్కడే చిక్కుకుపోయాడు. తనను కాపాడాల్సిందిగా మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావుకు వాట్సాప్ ద్వారా నవాజ్ విజ్ఞప్తి చేశాడు. తక్షణమే స్పందించిన హరీశ్‌రావు అక్కడి ఏజెంట్‌తో మాట్లాడి నవాజ్‌ను తిరిగి స్వగ్రామానికి పంపాలని కోరాడు. ఇండియాకు తిరిగి రావడానికి కావాల్సిన టికెట్‌కు ఆర్థికసాయాన్ని అతని తండ్రి మహబూబ్ అలీకి అందజేశారు. నవాజ్‌ను ఇండియాకు తీసుకొచ్చేందుకు తగిన ఏర్పాట్లు చేస్తానని, అధైర్యపడొద్దని అండగా ఉంటానని హరీశ్‌రావు ధైర్యం చెప్పారు.

## సైనికుడి కుటుంబానికి హరీశ్‌రావు అండ

జవాన్ బూరు రామస్వామి

సాదాబైనామా చూపిస్తున్న శామవ్వా, వెంకటయ్య

దుబ్బాక, మే 17: దేశ రక్షణ కోసం సరిహద్దుల్లో ప్రాణాలకు తెగించి, శత్రువులతో పోరాటం చేస్తుంటే.. స్వగ్రామంలో తమ కుటుంబానికి చెందిన వ్యవసాయ భూమికి రక్షణ లేకుండా పోయిందని సోషల్ మీడియాలో ఓ జవాన్ తన ఆవేదన వ్యక్తం చేశాడు. ఈ విషయంపై మాజీ మంత్రి హరీశ్‌రావు స్పందించారు. ఆ జవాన్ భూసమస్య పరిష్కరించాలని సిద్దిపేట జిల్లా కలెక్టర్‌కు ఫోన్‌లో హరీశ్‌రావు కోరారు. వివరాలు.. సిద్దిపేట జిల్లా దుబ్బాక నియోజకవర్గంలోని అక్బర్‌పేట-భూంపల్లి మండలం చౌదర్‌పల్లికి చెందిన ఆర్మీ సైనికుడు బూరు రామస్వామి కశ్మీరు సరిహద్దులో విధులు నిర్వహిస్తున్నాడు. శనివారం ఉదయం జవాన్ రామస్వామి ఓ వీడియోను సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేశాడు. తమ ప్రాణాలకు తెగించి శత్రుదేశం పాకిస్థాన్‌తో జరుగుతున్న యుద్ధంలో కశ్మీర్‌లో విధులు నిర్వహిస్తుంటే, మరోపక్క తన స్వగ్రామంలో తన కుటుంబానికి చెందిన వ్యవసాయ భూమిని ఓ రెవెన్యూ అధికారి అక్రమంగా కబ్జా చేసి, తప్పుడు రికార్డులు సృష్టించాడంటూ ఆవేదన వ్యక్తం చేశాడు. గతంలో తన తండ్రి వెంకటయ్య సాదాబైనామా ద్వారా 1.16 ఎకరాల భూమి కొనుగోలు చేసినట్లు తెలిపాడు. ఆ భూమిని తమ గ్రామానికి చెందిన వీఆర్వో రమేశ్, అతడి సోదరుడు కలిసి రికార్డుల్లో లేకుండా చేశారని ఆరోపించాడు. ఆ భూమి విషయంలో తమ తల్లిదండ్రులు శామవ్వా ,వెంకటయ్యను బెదిరింపులకు గురిచేస్తున్నారని తెలిపాడు. ఈ విషయంపై తహసీల్దార్, ఆర్డీవో, కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లినా న్యాయం జరగలేదని వాపోయాడు. ఈ సమస్యను పరిష్కరించాలని కోరుతూ సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లేందుకు సామాజిక మాధ్యమంలో వీడియోను పోస్టు చేస్తున్నట్లు జవాన్ తెలిపాడు. ఈ వీడియో సీఎం దృష్టికి వెళ్లేంత వరకు వైరల్ చేయాలని కోరాడు. ఈ వీడియోను చూసిన మాజీమంత్రి హరీశ్‌రావు స్పందించి వెంటనే జిల్లా కలెక్టర్ మనుచౌదరితో ఫోన్‌లో మాట్లాడి, సైనికుడి కుటుంబానికి చెందిన భూసమస్య పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. కలెక్టర్ ఆదేశాలతో అక్బర్‌పేట-భూంపల్లి తహసీల్దార్ మల్లికార్జున్‌రెడ్డి చౌదర్‌పల్లిలో సైనికుడి కుటుంబానికి చెందిన భూమిని పరిశీలించారు. సైనికుడు రామస్వామి తల్లిదండ్రులతో మాట్లాడి వివరాలు సేకరించారు. ఈ విషయంపై తహసీల్దార్ మల్లికార్జున్‌రెడ్డి మాట్లాడుతూ... సైనికుడు తండ్రి వెంకటయ్య 35 ఏండ్ల కిందట సాదాబైనామా ద్వారా భూమి కొనుగోలు చేసినట్లు వారి వద్ద ఉన్న పత్రాలను బట్టి తెలిసిందన్నారు. ఆ భూమి చుక్క నర్సవ్వ పేరుతో ఉన్నట్లు ధరణిలో వస్తున్నదన్నారు. దీంతో వీరి పేరిట భూమిని రికార్డులో నమోదు చేయడానికి గతంలో అవకాశం లేకుండా పోయిందన్నారు. ఈ భూమికి సంబంధించిన పూర్తి వివరాలను పరిశీలించి సైనికుడి కుటుంబానికి న్యాయం చేస్తామని తహసీల్దార్ తెలిపారు.

## రైతుల మేలుకే భూభారతి చట్టం

కొండాపూర్‌లో మాట్లాడుతున్న రెవెన్యూ శాఖ మంత్రి పొంగలేటి శ్రీనివాస్‌రెడ్డి

- రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

కొండాపూర్, మే 17: రైతుల భూసమస్యల పరిష్కారానికే భూభారతి చట్టాన్ని ప్రభుత్వం తెచ్చిందని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శనివారం సంగారెడ్డి జిల్లా కొండాపూర్ మండల కేంద్రంలో భూభారతిపై రైతులకు నిర్వహించిన అవగాహన సదస్సులో టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలాజగ్గారెడ్డితో కలిసి మంత్రులు దామోదర రాజనరసింహ, పొంగులేటి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ.. భూభారతి చట్టంతో వేగంగా భూ సమస్యలు పరిష్కారమవుతాయని తెలిపారు. రైతుల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందన్నారు. కలెక్టర్ వల్లూరి క్రాంతి, టీ పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి, జహీరాబాద్ ఎంపీ సురేశ్ షెట్కార్, నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవ రెడ్డి, అదనపు కలెక్టర్ మాధురి, ఆర్డీవో రవీందర్‌రెడ్డి, తహసీల్దార్ అశోక్, ఎంపీడీవో శ్రీనివాస్, మార్కెట్ కమిటీ చైర్మన్ సడాకుల కుమార్, ఆత్మ కమిటీ చైర్మన్ ప్రభు, మాజీ ఎంపీపీ మనోజ్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్లు శ్రీకాంత్‌రెడ్డి, మాణిక్‌రెడ్డి, నాయకులు మాజీ ఎంపీటీసీ నర్సింహారెడ్డి, వేంకటేశంగౌడ్, జగదీశ్, ప్రభుదాస్, నర్సింహులు, విష్ణువర్ధన్‌రెడ్డి, అశోక్, మల్లారెడ్డి, మండల వ్యవసాయాధికారి గణేశ్, ఏఈవోలు, రైతులు పాల్గొన్నారు.

## బొగ్గు రైలులో చెలరేగిన మంటలు

- అప్రమత్తమైన లోకో పైలట్

మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

చిన్నశంకరంపేట, మే 17: బొగ్గు లోడుతో వెళ్తున్న రైలులో పొగలు వ్యాపించిన సంఘటన శనివారం మెదక్ జిల్లా చిన్నశంకరంపేట మండలంలోని మిర్జాపల్లి రైల్వే స్టేషన్‌లో చోటుచేసుకుంది. స్టేషన్ మాస్టర్ ప్రసన్నకుమార్ వివరాల ప్రకారం.. రామగుండం నుంచి కర్ణాటక రాష్ట్రం రాయచూర్‌కు బొగ్గులోడుతో వెళ్తున్న రైలులో ఒక బోగిలో అకస్మాత్తుగా పెద్ద ఎత్తున పొగలు వ్యాపించాయి. అప్రమత్తమైన లోకోపైలట్ నునావత్ కుమార్, ట్రైన్ మేనేజర్ శ్రీకాంత్ హుటాహుటినా స్టేషన్ మాస్టర్ ప్రసన్నకుమార్‌కు సమాచారం అందించి రైలును అత్యవసరంగా మిర్జాపల్లి రైల్వే స్టేషన్‌లో నిలిపివేశారు. స్టేషన్ మాస్టర్ రామయంపేట అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించడంతో అగ్నిమాపక శకటంతో రైల్వేస్టేషన్‌కు చేరుకున్నారు. గూడ్స్ రైలు పైన విద్యుత్ తీగలు ఉండడంతో స్టేషన్ మాస్టర్ విద్యుత్ సరఫరా నిలిపివేయడానికి రైల్వే ఉన్నతాధికారుల అనుమతి తీసుకుని విద్యుత్ నిలిపివేసి పొగలు అదుపుచేశారు. అనంతరం రైలు అక్కడ నుంచి వెళ్లిపోయింది. అగ్నిమాపక సిబ్బంది నరేశ్, లింగం బాల్‌రాజ్, నరేందర్ పాల్గొన్నారు.

# నకిలీ విత్తు.. రైతుకు విపత్తు!

- కాలం చెల్లిన విత్తనాలు అంటగడుతున్న వ్యాపారులు
- పంట సాగుచేశాక నష్టపోతున్న రైతులు
- వ్యవసాయాధికారుల తనిఖీలు అంతంతే
- ముంచుకొస్తున్న వానకాలం సీజన్
- గతేడాది పలు ఘటనలు వెలుగులోకి..
- అప్రమత్తతే రైతులకు శ్రీరామరక్ష

### నకిలీ విత్తనాలతో రైతులకు మోసం

గజ్వేల్‌లో పోలీసుల తనిఖీల్లో పట్టుబడిన కాలం చెల్లిన విత్తనాలు, పురుగుల మందులు(ఫైల్)

గజ్వేల్, మే 17: రైతులకు నకిలీ విత్తన కష్టాలు తప్పడం లేదు. అమాయక రైతులకు కొందరు వ్యాపారులు కాలం చెల్లిన విత్తనాలను అంటగడుతూ సొమ్ముచేసుకుంటున్నారు. కాలం చెల్లిన విత్తనాలను మార్కెట్‌లో అమ్మకాలు చేపట్టవద్దని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నా, వారి మాటలను పెడచెవిన పెడుతూ కొందరు వ్యాపారులు సొమ్ము చేసుకుంటున్నారు. గజ్వేల్ కేంద్రంగా కాలం చెల్లిన, నకిలీ విత్తనాల అమ్మకాలు జరుగుతున్నా వ్యవసాయ అధికారులు పట్టనటుగా వ్యవహరిస్తున్నరనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. గజ్వేల్ నియోజకవర్గ కేంద్రానికి విత్తనాలు కొనుగోలు చేసేందుకు గజ్వేల్, జగదేవ్‌పూర్, వర్గల్, మర్కూక్, రాయపోల్, దౌల్తాబాద్, ములుగు మండలాలకు చెందిన రైతులు వస్తుంటారు. గజ్వేల్ నియోజకవర్గ పరిధిలోని ఆయా గ్రామాల్లో ఎక్కువగా వరి, పత్తి, మొక్కజొన్న, కూరగాయల పంటలు సాగు చేస్తారు. గజ్వేల్, జగదేవ్‌పూర్ మండలాల్లో రైతులు చాలా ఏండ్లుగా వరి, పత్తి పంటలు ఎక్కువగా సాగు చేస్తున్నారు. వర్గల్, ములుగు, మర్కూక్ మండలాల్లో మాత్రం రైతులు ఎక్కువగా కూరగాయలు పండిస్తున్నారు. ఈ ప్రాంత రైతుల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకొని వ్యాపారులు కాలం చెల్లిన విత్తనాలను అమ్మకాలు చేపడుతూ మోసం చేస్తున్నారు. దీంతో రైతులు పంటలు సాగు చేసి తీవ్రంగా నష్టపోతున్నారు. ఆశించిన దిగుబడి రాకపోవడంతో రైతులు దిగులు పడుతున్నారు. కొన్ని విత్తనాలు మాత్రం అసలు పూత, కాత లేకుండా ఏపుగా పెరగడంతో తీవ్రంగా నష్టపోయిన సంఘటనలు ఉన్నాయి.

### రెండు వారాల క్రితం..

15రోజుల క్రితం గజ్వేల్ మండలం గిరిపల్లి గ్రామానికి చెందిన రైతు గజ్వేల్‌లోని ఓ ఫర్టిలైజన్ దుకాణంలో మొక్కజొన్న (బుట్ట మొక్కజొన్న) విత్తన ప్యాకెట్లను కొనుగోలు చేశాడు. విత్తనాలను విత్తే సమయంలో ప్యాకెట్‌ను తెరిచి చూడగా, అందులోని విత్తనాలు పురుగులు పట్టి పుచ్చుతో ఉన్నాయి. వెంటనే ఆ విత్తన ప్యాకెట్‌ను తీసుకొని దుకాణాదారుడి వద్దకు వెళ్లగా పొంతనలేని సమాధా నం చెప్పడంతో వెంటనే వ్యవసాయాధికారులకు ఫిర్యాదు చేశాడు. గతేడాది జగదేవ్‌పూర్ మండలంలోని తీగుల్ గ్రామానికి చెందిన రైతు గజ్వేల్ పట్టణంలోని ఓ దుకాణంలో కర్బూజ విత్తనాలు కొనుగోలు చేసి సాగుచేశాడు. పంట చేతికొస్తుందనే సమయానికి ఎలాంటి ఖాతా రాకుండా ఉండడంతో అధికారులకు ఫిర్యాదు చేశాడు. కర్బూజ పంట సాగు కోసం చేసిన అప్పులతో పాటు పెట్టుబడులు అతనికి భారంగా మారాయి. ఇలాంటి సంఘటనలు అనేకం చోటుచేసుకుంటున్నా వ్యవసాయాధికారులు మాత్రం ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. కేవలం రికార్డులను తనిఖీ చేయడానికే పరిమితమవుతున్నారు తప్పా కాలం చెల్లిన విత్తనాలను గుర్తించడంలో విఫలమవుతున్నరనే విమర్శలు ఉన్నాయి. గతేడాది మేలో ఏసీపీ పురుషోత్తంరెడ్డి ఆధ్వర్యంలో చేపట్టిన తనిఖీల్లో గజ్వేల్‌లోని లక్ష్మీబాలాజీ ట్రేడర్స్, పవనసుత ట్రేడర్స్, శ్రీ సాయి ఫర్టిలైజర్స్ దుకాణాల్లో కాలంచెల్లిన వరి, మెంతులు, గంగవాయిలి కూర, బీర్నీస్‌తో పాటు కాలంచెల్లిన పురుగుల మందులు పట్టుకున్నారు. 610 కిలోల కాలం చెల్లిన విత్తనాలను పట్టుకొని వ్యవసాయాధికారులకు అప్పగించారు. ప్రజ్ఞాపూర్‌లోని పద్మావతి రైతు సేవా కేంద్రంలో కాలం చెల్లిన విత్తనాలు పట్టుకున్నారు. ఇలాంటి సంఘటనలు ఏటా చోటు చేసుకుంటున్నా వ్యవసాధియాకారులు మాత్రం ముందస్తుగా మేల్కొనడం లేదనే విమర్శలు ఉన్నాయి. రైతులు ఫిర్యాదు చేసినా అధికారులు అంటిముట్టనట్లుగా వ్యవహరిస్తున్నరనే ఆరోపణలు ఉన్నాయి. నకిలీ, కాలంచెల్లిన విత్తనాలు విషయంలో రైతులు అప్రమత్తంగా ఉండాలి. విత్తనాల మీద ఏమాత్రం అనుమానం వచ్చినా అధికారుల దృష్టికి తీసుకెళ్లాలి. విత్తనాల కొనుగోళ్లకు సంబంధించి రసీదులు దగ్గర ఉంచుకోవాలి. నష్టపోయినప్పుడు రైతులు వినియోగదారుల ఫోరం, కోర్టుల్లో కేసులు వేసి నష్టపరిహారాన్ని పొందే అవకాశం ఉంటుంది.

## ఏపీ, కర్ణాటక, మహారాష్ట్ర నుంచి నకిలీ విత్తనాలు దిగుమతి

- సీడ్ ఆర్గనైజర్లే సూత్రదారులు
- లూజు విత్తనాలు.. ఆకర్షణీయమైన కవర్లలో ప్యాకింగ్
- వరి, పత్తి విత్తనాలపై నిఘా కరువు

పటాన్‌చెరు, మే 17: వానకాలం సమీపిస్తున్నా వ్యవసాయశాఖ విత్తనాలు, ఎరువుల సరఫరాపై దృష్టి సారించడం లేదు. ఎరువులు, విత్తనాల విక్రయాలపై తనిఖీలు చేయడం లేదు. పటాన్‌చెరు వ్యవసాయశాఖ సబ్ డివిజన్‌లోని పటాన్‌చెరు, రామచంద్రాపురం, అమీన్‌పూర్, జిన్నారం, గుమ్మడిదల మండలాల్లో ఎక్కువ మంది రైతులు వర్షాధార పంటలతో పాటు చెరువులు, బోరుబావుల వద్ద వానకాలంలో వరి, పత్తి పంటలు సాగుచేస్తుంటారు. కొందరు రైతులు కూరగాయలు సాగుచేస్తారు. విత్తన వ్యాపారులు ఏపీతో పాటు కర్ణాటక, మహారాష్ట్ర నుంచి లూజు విత్తనాలు తెచ్చి, రంగురంగుల ప్యాకెట్లుగా ప్యాకింగ్ చేసి, ఇక్కడ ప్రతి ఏడాది అమ్మకాలు చేస్తున్నారు. నకిలీ విత్తనాలు కొనుగోలు చేసిన రైతులు పంట దిగుబడి రాక, తీవ్రంగా నష్టపోతున్నారు. ఏటా సీజన్‌లో నకిలీ విత్తనాల అమ్మకాలు నివారించేందుకు ట్రాస్స్‌ఫోర్స్ టీమ్ ఏర్పాటు చేసినా తనిఖీలు సరిగ్గా చేయడం లేదనే అపవాదు ఉంది. మరో 15 రోజుల్లో వానకాలం సీజన్ ప్రారంభం కానున్నా వ్యవసాయశాఖ ప్రణాళిక సిద్ధం చేయడం లేదు. గ్రామాల్లో రైతులకు ఇప్పటి వరకు భూసార ఫలితాలు అందించలేదు. ఈ సీజన్‌లో రైతులు తమ భూముల్లో ఏ పంటలు సాగు చేయలో తెలపడం లేదు.

### ఇదో పెద్ద దందా...

విత్తన కంపెనీలు ఏపీ, కర్ణాటక, మహారాష్ట్రలో మూతపడిన ఫ్యాక్టరీలను లీజ్‌కు తీసుకొని లూజు విత్తనాలు కొనుగోలు చేసి, రంగు రంగు ప్యాకెట్‌లో ప్యాకింగ్ చేసి తెలంగాణలోకి తీసుకువచ్చి అమ్మకాలు చేస్తున్నాయి. వ్యాపారులు ఇష్టారాజ్యంగా దుకాణాలు ఏర్పాటుచేసి విత్తనాలు, ఎరువులు అమ్మకాలు చేస్తున్నారు. కొందరు వ్యాపారులు రైతులకు ఉద్దెరకు నాసిరకం విత్తనాలు అంటగడుతున్నారు. దీంతో దిగుబడులపై ప్రభావం పడుతున్నది. విత్తనాలు ఇచ్చినందుకు పంట చేతికి వచ్చిన తర్వాత కల్లాల్లోనే తూకం వేసి పంటను తీసుకుంటున్నారు. మరికొందరు రైతులు వడ్డీతో కలిపి అసలు తీసుకుంటున్నారు. రైతుల వద్ద విత్తనాలు కొనుగోలు చేసేందుకు డబ్బులు లేకపోవడంతో కొందరు వ్యాపారులు ఆశచూపి చెప్పిన ధరకు విత్తనాలు కొనుగోలు చేయిస్తున్నారు. విత్తనాలు నకిలీవా, కావా అని రైతులు పరిశీలించడం లేదు. ఎక్కువ మంది వ్యాపారులు లూజు విత్తనాలు ప్యాకింగ్ చేసి అమ్మకాలు చేస్తుండడంతో పంట దిగుబడులు తగ్గుతున్నాయి. వ్యవసాయశాఖ పర్యవేక్షణ సరిగ్గా లేక విత్తన వ్యాపారులు జోరుగా దందా సాగిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. నకిలీ విత్తన వ్యాపారానికి సీడ్ ఆర్గనైజర్లు అసలు సూత్రదారులుగా పనిచేస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి.

మహ్మదాపూర్‌లో పోలీసులు పట్టుకున్న నకిలీ విత్తనాల బస్తాలు (ఫైల్)

## బాధిత కుటుంబాలకు వంటేరు పరామర్శ

- రూ. 10 వేల ఆర్థిక సాయం అందజేత


బాధిత కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి

తూప్రాన్, మే 17 : మెదక్ జిల్లా తూప్రాన్‌లో శనివారం పిడుగుపాటుకు గురై మృతిచెందిన ఇద్దరు బాలురు కుటుంబాలను బీఆర్ఎస్ గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి పడాలపల్లిలో బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి, రూ. 10 వేల తక్షణ ఆర్థిక సహాయాన్ని అందజేశారు. రెక్కాడితే కానీ డొక్కాడని కుటుంబంలో పిల్లలు అకాల మృతి చెందడం చాలా బాధాకరమని, ప్రభుత్వం వెంటనే స్పందించి మృతుల కుటుంబాలకు రూ. 10 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. జిల్లా కలెక్టర్, ఆర్డీవో స్పందించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరారు.

### పిడుగుపాటుకు ఇద్దరు మృతి...

స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మెదక్ జిల్లా తూప్రాన్ మున్సిపాలిటీ పరిధి 11వ వార్డు పడాలపల్లికి చెందిన నడిపల్లి యశ్వంత్ (14), పంబల్ల ప్రసాద్ (14), మొకద్దం కిరణ్ శనివారం సాయంత్రం క్రికెట్ ఆడుదామని పడాలపల్లికి సమీపంలోని ఊర చెరువు మైదానంలోకి వెళ్లారు. క్రికెట్ ఆడుతుండగా అకస్మాత్తుగా జోరుగా గాలివాన వీచింది. పిల్లలందరూ అక్కడున్న చెట్లవైపు పరుగులు తీశారు. కాసేపటికే భారీ శబ్దంతో ఉరుముతూ యశ్వంత్, ప్రసాద్, కిరణ్ తలదాచుకున్న చెట్టుపై పిడుగు పడింది. దీంతో తీవ్ర గాయాలపాలైన నడిపల్లి యశ్వంత్, పంబల్ల ప్రసాద్ అక్కడికక్కడే మృతిచెందారు. మొకద్దం కిరణ్ తీవ్రంగా గాయపడ్డాడు. అంబులెన్సులో ముగ్గురిని తూప్రాన్ ప్రభుత్వ దవాఖానకు తరలించారు. తీవ్రంగా గాయపడ్డ మొకద్దం కిరణ్‌ను మెరుగైన వైద్యం కోసం ములుగులోని ఆర్‌వీఎం దవాఖానకు తరలించారు.

## భూభారతిని పక్కాగా అమలుచేయాలి

- చట్టాన్ని తప్పుదోవ పట్టిస్తే అధికారులపై చర్యలు
- గిరిజన రైతులను ఇబ్బంది పెట్టొద్దు
- చిలిపిచెడ్‌లో రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి
- ధరణితోనే 80శాతం భూ సమస్యలు పరిష్కారం
- చిలిపిచెడ్‌లో ప్రభుత్వ కార్యాలయాలు మంజూరు చేయాలి
- నర్సాపూర్‌లో ఆర్డీవో కార్యాలయం ఏర్పాటు చేయాలి
- నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి విజ్ఞప్తి

మాట్లాడుతున్న మంత్రి శ్రీనివాస్‌రెడ్డి

చిలిపిచెడ్, మే 17: భూభారతి చట్టాన్ని దుర్వినియోగం చేసే అధికారులు ఎంతటి వారైనా చర్యలు తప్పవని, గిరిజన రైతులను ఇబ్బందులకు గురిచేయవద్దని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శనివారం మెదక్ జిల్లా చిలిపిచెడ్‌లోని రైతువేదికలో భూభారతి చట్టం ముగింపు సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ రాహుల్ రాజ్, నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి, మెదక్ ఎంపీ రఘునందన్‌రావు, ఎమ్మెల్సీ అంజిరెడ్డి పాల్గొన్నారు. అనంతరం మంత్రి పొంగుటేటి మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా 18 రాష్ట్రాల్లో రెవెన్యూ చట్టాలను క్షుణ్ణంగా పరిశీలించి, వాటిలో నుంచి కొన్ని ముఖ్యమైన అంశాలతో కలిపి భూభారతి చట్టం తెచ్చి పోర్టల్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మనిషికి ఆధార్ ఎలా ఉంటుందో, అదేవిధంగా భూములకు భూదాన్‌ను ఈ చట్టంలో పేర్కొన్నట్లు తెలిపారు. 2025 చట్టానికి ముందే 10956 వీఆర్ఏ, వీఆర్వో వ్యవస్థ ఉండేదని, ఆనాటి ముఖ్యమంత్రి ఆలోచనలకు అనుగుణంగా ఆ వ్యవస్థను రద్దు చేశారన్నారు. చిలిపిచెడ్ మండలంలోని 16 రెవెన్యూ గ్రామాల్లో భూ సమస్యలపై వేయి దరఖాస్తులు వచ్చాయని, భూభారతి కోసం నాలుగు పైలట్ మండలాలు ఎంపిక చేశామన్నారు. సాదాబైనామా కాకుండా మిగతా అంశాలు అన్నింటినీ నాలుగు మండలాల్లో జూన్ 2 తేదీ వరకు పరిష్కరిస్తామని మంత్రి తెలిపారు. రాష్ట్రంలో 32 మండలాల్లో భూ భారతి చట్టం తీసుకువచ్చామని, దీని ద్వారా వచ్చిన ఫలితాలను ఆలోచించి జూన్ 2 తేదీ నుంచి రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేస్తామని తెలిపారు. ఆగస్టు 15నాటికి ఎక్కువ సమస్యలను భూభారతి చట్టం ద్వారా పరిష్కరించాలని ప్రభుత్వం లక్ష్యం అన్నారు. గత ప్రభుత్వం నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లను నెలాఖరులోపు అర్హులకు ఇవ్వాలని అధికారులను మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఆదేశించారు.

**ధరణితో 80శాతం భూసమస్యలు పరిష్కారం: ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి**

బీఆర్ఎస్ ప్రభుత్వం ధరణి పోర్టల్ తెచ్చి 80శాతం భూసమస్యలు పరిష్కరించిందని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి ఈ సందర్భంగా పేర్కొన్నారు. భూభారతి పైలట్ ప్రాజెక్టుగా చిలిపిచెడ్ మండలాన్ని తీసుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. గౌతాపూర్ గన్య తండాలో 200 వందమంది రైతులకు పట్టా పాసుబుక్‌లు ఇస్తే, వారికి రైతుబంధు వస్తుందన్నారు. పట్టా పాసుబుక్‌లు లేకపోవడంతో ధాన్యం వారి పేరు మీద విక్రయాలు కావడం లేదని ఎమ్మెల్యే మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. మెదక్ జిల్లాలో అటవీ ప్రాంతం ఎక్కువగా ఉందని, శివ్వంపేట మండలంలో నవాబ్‌పేటకు సంబంధించిన గ్రామం మొత్తం 14ఎకరాలు రెవెన్యూ ఫారెస్టుతో ఒక్కరికి కూడా పట్టా సర్టిఫికెట్ ఇవ్వలేదని మంత్రి దృష్టికి తెచ్చారు. చిలిపిచెడ్ మండలానికి తహసీల్, ఎంపీడీవో, పోలీస్‌స్టేషన్, నర్సాపూర్‌లో ఆర్డీవో కార్యాలయం మంజూరు చేయాలని మంత్రి పొంగులేటిని ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి కోరారు. నర్సాపూర్‌లో డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు చాలా వరకు పెండింగ్‌లో ఉన్నాయని, వాటికి నిధులు మంజూరు చేయాలని మంత్రిని కోరారు. పార్టీలకతీతంగా ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని కోరారు. చిలిపిచెడ్ మండలంలో కొనసాగుతున్న అంతారం రెవెన్యూ గ్రామాన్ని కౌడిపల్లి మండలంలో విలీనం చేయాలని మంత్రి ఈ సందర్భంగా ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ సుహాసినీరెడ్డి, మెదక్, నర్సాపూర్, తూప్రాన్ ఆర్డీవోలు రమాదేవి, మహిపాల్ రెడ్డి, జయచంద్రారెడ్డి, తహసీల్దార్లు సహాదేవ్, ఆంజనేయులు, శ్రీనివాస్, ఎంపీడీవో ఆనంద్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

మాట్లాడుతున్న నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి

# రెవెన్యూలో షాడో బాస్‌లు?

- కార్యాలయంలో వారి మాటే శాసనం
- ప్రతినెలా జిల్లా, డివిజన్ అధికారులకు భారీగా ముడుపులు?
- ప్రభుత్వ భూముల సమాచారం లీకులు..?
- చక్రం తిప్పుతున్న పటాన్‌చెరు నియోజకవర్గ అధికారులు

### తహసీల్ కార్యాలయాల్లో ఆర్ఐలు, నాయబ్ తహసీల్దార్లదే హవా..?

పటాన్‌చెరు తహసీల్ కార్యాలయం

పటాన్‌చెరు, మే 17: సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు నియోజకవర్గంలో రెవెన్యూ శాఖలో కొందరు అధికారులు ఏండ్ల తరబడి ఇక్కడే తిష్టవేసి చక్రం తిప్పుతున్నారు. రాజకీయ పలుకుబడి, జిల్లా అధికారుల ప్రోత్సాహంతో పటాన్‌చెరు, అమీన్‌పూర్, రామచంద్రాపురం, గుమ్మడిదల, జిన్నారం మండలాల్లో కొందరు నాయబ్ తహసీల్దార్లు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు( ఆర్ఐ) ఏండ్లుగా ఒకేచోట పనిచేస్తూ షాడోబాస్‌లుగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. పటాన్‌చెరు నియోజకవర్గం హైదరాబాద్‌కు సమీపంలో ఉండడంతో ఈ ప్రాంతంలోని భూములు హాట్‌కేకులా మారాయి. అధికార పార్టీ నేతల మద్దతుతో పాటు జిల్లా, డివిజన్ స్థా